క్లుప్తంగా

విగ్రహాలకు ముసుగులు తొలగించండి

వీరఘట్టం: సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో రెండు నెలల క్రితం రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను తొలగించాలని ఎంపీడీఓ ఎం.వి.బి. సుబ్రహ్మణ్యం పంచాయతీ కార్యదర్శులను గురువారం ఓ ప్రకటనలో ఆదేశించారు. తక్షణమే గ్రామాల్లో, కూడళ్లలో విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతంపేట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఈఈ గోపాలకృష్ణ, ఏఈ జి.నీలిమ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సీతంపేట, దోనుబాయి పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



ఏఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న బత్తిలి యువకులు

భామిని: మండలంలోని బత్తిలి గ్రామంలో తరచూ తలెత్తే విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. లోవోల్టేజీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం, విద్యుత్ కోత వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఆయా సమస్యలను నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం



నిడగల్లులో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ కుమారవర్మ

సీతానగరం: వర్షాలు పడనున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ అన్నారు. మండలంలో ని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు, విద్యుదీకర ణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు నిడగల్లు, గుచ్చిమి, వెంకటాపురం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నిడగల్లులో మూడు రోజులుగా కాలువల్లో పూడికలు తీయిస్తున్నట్లు తెలిపారు. వెంకటాపురం, అంటిపేట, గుచ్చి మి గ్రామాల్లో విద్యుత్ మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్ బల్బులు వేస్తున్నట్లు చెప్పారు. అలాగే నీలాటిరేవులో పేరుకుపోతున్న పిచ్చి మొక్కలను తొలగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి. తిరుపతిరావు, లక్ష్మి, శశిభూషణరావు, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పార్వతీపురం టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వీవీ కిశోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఎంఆర్ నగరం ఫీడర్‌లో నిర్వహణ పనులు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని వెంకంపేట, చినబొండపల్లి, ఎమ్మార్‌నగరం, సంగవలస, లోపలవలస, లక్ష్మీనారాయణపురం నుంచి పెద్దమరికి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

సాలూరు: పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీలో కొలువైన కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పంచామృతాలతో అభిషేకం జరిపించగా.. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- జిల్లా పంచాయతీరాజ్ అధికారి బి.సత్యనారాయణ



గరుగుబిల్లి: శివ్వాంలో క్లోరినేషన్ చర్యలను పరిశీలిస్తున్న డీపీవో సత్యనారాయణ

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి బి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని మండలంలోని శివ్వాం, గొట్టివలస గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులు, క్లోరినేషన్ చర్యలను ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావుతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోని మంచినీటి బావుల్లో క్లోరినేషన్ చేపట్టాలని, పారిశుద్ధ్య చర్యలను మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామస్తులు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, మండల ఇంజినీరింగ్ అధికారి గౌరీశంకరరావు, కార్యదర్శి అప్పారావు, తదితరులు ఉన్నారు.

కురుపాం: మండల కేంద్రంలోని పలు వీధుల్లో దోమల నివారణ మందు గురువారం పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతీ గ్రామంలోనూ పారిశుద్ధ్య చర్యలు మెరుగుపరుస్తున్నామని పంచాయతీ కార్యదర్శులు కె.చంద్రశేఖర్, అనిత తెలిపారు. కాలువలు, మురుగునీటి నిల్వల వద్ద దోమలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



కురుపాంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

చురుగ్గా పారిశుధ్య పనులు



గ్రామీణ వికాస్ బ్యాంక్ వీధిలో కాలువల్లో పూడిక తీతలు చేపడుతున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. ఆర్‌టీసీ కాంప్లెక్స్, గ్రామీణ వికాస్ బ్యాంక్, సుందరయ్య కాలనీ, మెయిన్‌రోడ్డు, ఆర్‌సీఎం చర్చి వీధుల్లోని కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. అలాగే ప్రధాన రోడ్లు, కాలువల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో విజృంభించే సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా ఈ చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ బి.గౌరీశంకరరావు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కిశోర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.



సీతంపేట: కుద్దపల్లిలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్‌డీ సత్యం

సీతంపేట: మండలంలోని కుద్దపల్లి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఈవోపీఆర్‌డీ కె. సత్యం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి బారినపడకుండా ఇప్పటినుంచే అప్రమత్తం కావాలన్నారు. దోమల నివారణకు దోమల నివారణ మందు ఇంటి వద్ద, కాలువల వద్ద పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పాపారావు పాల్గొన్నారు.

నవగాంలో 'ఫ్యామిలీ డాక్టర్'



వృద్ధుడి బీపీ తనిఖీ చేస్తున్న వైద్యాధికారి రవికుమార్

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని ఎం.సింగపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్ తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని సూచించారు.

కవ్వింపు చర్యలకు పాల్పడవద్దు



పెదకాపు వీధిలో పోలీస్ పికెటింగ్ రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్

పాలకొండ రూరల్: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరూ కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని పాలకొండ ఎస్‌ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్ సూచించారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పెదకాపు, చినకాపు, గేదెల వారి వీధుల్లో గురువారం పర్యటించిన ఆయన ఎన్నికల నేపథ్యంలో ఆయా చోట్ల ఏర్పాటు చేసిన పోలీస్ పికెటింగ్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడా ఎటువంటి గొడవలు జరగకుండా చూడాలని, ప్రజలు కూడా సంయమనం పాటించాలని తెలిపారు. ముఖ్యంగా యువత అనవసరంగా తగాదాలకు దిగి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. అందరూ సోదరభావంతో మెలగాలన్నారు. ప్రవర్తనకు అనుగుణంగానే పికెటింగ్ ఎత్తివేత ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో జైగురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, కాకడహారతి తదితర పూజలు చేయగా, అనంతరం వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్. శర్మయాజి సహాయ,సహకారాలతో హోమం చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



జిల్లేడుపాడులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, జనచేతన ప్రతినిధి

సీతంపేట: బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనచేతన సంస్థ చైర్మెన్ శశిభూషణ్‌చౌదరి కోరారు. అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని జిల్లేడుపాడు, కోడిశ గ్రామాల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు, ర్యాలీ నిర్వహించారు. బాలల హక్కులు, పరిరక్షణ చట్టాల గురించి వివరించారు. అనంతరం బాలకార్మికుల చట్టాల గూర్చి వివరించారు. 'నిబద్ధతతో చర్యలు తీసుకుం దాం...బాల కార్మిక త్వాన్ని అంతం చేద్దాం' అనే నినాదంతో ప్రోచైల్డ్ గ్రూప్-క్రాప్ ప్రోచైల్డ్ గ్రూప్, సీఆర్‌ఏఎఫ్ ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఉపాధ్యాయులు ఎం.ఆనప, ఎన్.ప్రకాశరావు, పి.శ్రీరాములు, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

దివ్యజ్ఞాన సత్సంగ సమావేశం

పాలకొండ: మండలంలోని గోపాలపురం గ్రామ సత్యసాయి మందిరంలో దివ్యజ్ఞాన సత్సంగ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ హాజరై, ఆలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన సత్యసాయి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగవంతుడిని ధ్యానించడంతోనే మోక్షం లభిస్తుందని, ప్రతిఒక్కరూ ప్రతిరోజూ భగవంతుడిని స్మరించుకోవాలని తెలిపారు. ప్రతీ యుగంలోనూ ధర్మానికి హాని కలిగినప్పుడు ఆ ధర్మాన్ని రక్షించేందుకు దేవుడు వస్తాడన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అలాగే సత్యసాయి బోధనలు అనుసరించాలన్నారు. అనంతరం రమణను గ్రామస్తులు సన్మానించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ప్రారంభం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ కర్మాగారం వద్ద వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు గురువారంతో ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆరు రోజు ల పాటు వార్షికోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గురువారం ఉదయం 8.30 గంటలకు శ్రీవారికి పంచామృతంతో అభిషేకం, ఉత్సవ అలంకరణ (పెళ్లి కుమారుడ్ని తయారు చేయడం).. సాయంత్రం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, దీపారాధన, తదితర పూజలు నిర్వహించినట్లు చెప్పారు. పూజల్లో ఎన్‌సీఎస్ యాజమాన్యం ప్రతినిధి ఎం. సూర్యనారాయణ, కర్మాగారం ఉద్యోగులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాముకాటుతో అస్వస్థత

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన జరజాపు నాగరాజు (45) గురువారం ఉదయం తన పొలంలో పనిచేస్తుండగా పాము కరిచింది. అస్వస్థతకు గురైన అతడిని మామిడిపల్లి పీహెచ్‌సీకి కుటుంబ సభ్యులు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నాగరాజును సాలూరు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

23న జాబ్‌మేళా


పార్వతీపురం టౌన్: కొప్పల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, భాస్కర్ విద్యాసంస్థల అధినేత చుక్కా భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక భాస్కర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, అమెజాన్ సంస్థలో ఉద్యోగాలకు కేఎల్ గ్రూప్ కన్సల్టెన్సీ జాబ్‌మేళా నిర్వహించనుందని చెప్పారు. 10వ తరగతి నుంచి డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొప్పుల వెలమ సంక్షేమ సంఘ ప్రెసిడెంట్ చల్లారపు రమేష్, సభ్యులు కార్తీక్, పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నది ఒడ్డున వెలసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పి.శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో స్వామివారిని వివిధ రకాల పత్ర, పుష్పాలతో అలంకరించారు.

నేత్ర శస్త్రచికిత్సకు 29 మంది ఎంపిక



వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సృజనా విద్యాలయం, ప్రభావతి జాగృతి ట్రస్టు సంయుక్తంగా ఉచిత నేత్ర వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 62 మంది కంటి రోగుల కళ్లను పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అయితే వీరిలో 29 మంది కంటి శుక్లాల ఆపరేషన్ కోసం ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సృజనా విద్యాలయ కరస్పాండెంట్ ఎ.జనార్దనరావు, క్యాంపు కో–ఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బల్లగూడలో వైద్యశిబిరం



మలేరియాతో బాధపడుతున్న బాలిక ఆరోగ్యం అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: మండలంలోని కుంబిడి-ఇచ్చాపురం పంచాయతీలో ఉన్న బల్లగూడ గిరిజన గ్రామంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని అఖిల అనే బాలికకు మలేరియా జ్వరం వచ్చిందని తెలుసుకుని, అప్రమత్తమైన వైద్యారోగ్య సిబ్బంది ఆ గ్రామం చేరుకుని, గ్రామస్తులందరికీ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం జ్వరంతో బాధపడుతున్న ఆ బాలికను పిలిచి ఆమె ఆరోగ్యంపై ఆరాతీశారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని వైద్యులు గ్రామస్తులకు సూచించారు. మురుగునీరు, కాలువల వద్ద దోమలు పెరగకుండా దోమల నివారణ మందు పిచికారీ చేయాలని ఎంపీడీవో ఎం.వి.వి.సుబ్రహ్మణ్యం సిబ్బందిని ఆదేశించారు. ఆ తర్వాత గ్రామంలో తాగునీటి బావిలో క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. సురక్షితమైన నీటినే తాగాలని తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థుల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న వైద్యుడు సంతోష్‌కుమార్

గరుగుబిల్లి: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్ కుమార్ సూచించారు. గురువారం మండలంలోని మరుపెంట గ్రామ ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు. ప్రతిరోజూ మనం తినే ఆహారంలో పౌష్టికాహారం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం తగినంత వ్యాయామం చేయడం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఉపాధ్యాయురాలు రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు అందజేత



పెద్దూరులో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు విశాలాక్షి

వీరఘట్టం: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు గురువారం అందజేశారు. వేసవి సెలవుల తర్వాత గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కాగా మండల వ్యాప్తంగా ఉన్న మొత్తం 62 పాఠశాలల్లో తొలిరోజు తరగతులకు 57 శాతం మంది హాజరైనట్లు ఎంఈవోలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు తెలిపారు. పాఠశాలలకు వచ్చిన విద్యార్థులందరికీ తొలిరోజే స్టూడెంట్ కిట్లు అందజేశామని, యూనిఫాం ఇంకా రావాల్సి ఉందని, శుక్రవారం షూ పంపిణీ చేస్తామన్నారు.

పాఠశాలలకు పుస్తకాల సరఫరా



ఎమ్మార్సీ నుంచి పాఠ్యపుస్తకాలు తీసుకువెళుతున్న సిబ్బంది

సీతంపేట: స్థానిక మండల వనరుల కేంద్రం(ఎమ్మార్సీ) నుంచి మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు ఎంఈఓ ఎం.ఆనందరావు ఆధ్వర్యంలో గురువారం పాఠ్యపుస్తకాలు సరఫరా చేశారు. పాఠశాలల సిబ్బంది వచ్చి పుస్తకాలను తీసుకువెళ్లారు. మండలంలో చదువుతున్న 10,350 మంది విద్యార్థులకు సరిపడా పుస్తకాలు ప్రభుత్వం సరఫరాల చేసిందని ఎంఈఓ తెలిపారు.



కొమరాడ: ఉపాధ్యాయులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో నారాయణస్వామి

కొమరాడ: వేసవి సెలవుల తర్వాత మండలంలోని మొత్తం 127 ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థుల రాకతో పాఠశాలలు కళకళలాడుతున్నాయి. ఉపాధ్యాయ సిబ్బంది కూడా విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేసే పనిలో నిమగ్నమయ్యారు.

కొమరాడ: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు కోటిపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న బుక్స్ స్టాక్ పాయింట్ వద్ద నుంచి పాఠ్యపుస్తకాలను గురువారం తరలించారు. మండల వ్యాప్తంగా మొత్తం 127 పాఠశాలలు ఉండగా, వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఆయా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు తరలిస్తున్నామని ఎంఈవో నారాయణస్వామి తెలిపారు. వీటితో పాటు యూనిఫాం, షూస్, బెల్టు, బ్యాగు తదితర సామగ్రి కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 చినతిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



భామిని: వ్యాన్‌లో పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు తరలిస్తున్న దృశ్యం

భామిని: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన బుక్స్ స్టాక్ పాయింట్ వద్ద నుంచి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు గురువారం తరలించారు. మండల వ్యాప్తంగా ఉన్న మొత్తం 62 పాఠశాలలకు స్కూల్ బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం, షూస్ పంపించామని ఎంఈవో వి.భాస్కరరావు తెలిపారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: మండలంలోని సిరికొండ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తంగి వేణుగోపాలరావు సిబ్బందితో కలిసి అటువైపుగా వస్తున్న వాహనాలను ఆపి, వాహనాల పత్రాలతో పాటు వాహనదారుల లైసెన్స్‌లను పరిశీలించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనాల ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ఆయన వెంట సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.